# నమస్తే తెలంగాణ
## మంచిర్యాల
### కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 5 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేందర్


ఎంపికైన సురేందర్

కోటపల్లి, సెప్టెంబర్ 4 : కోటపల్లి మండలం అన్నారం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శనిగారపు సురేందర్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యాడు. అన్నారం జడ్పీహెచ్ఎస్‌లో భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సురేందర్ విద్యా బోధన నూతన పద్ధతులు అవలంబించడం, పాఠాలు త్వరగా అర్థమయ్యేలా బోధించడంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్, జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్ ఎన్విరాన్మెంట్ ఎగ్జిబిషన్స్, ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డు కార్యక్రమాల్లో పాల్గొంటూ మారుమూల గ్రామంలో ఉన్న అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపును సంపాదించడంలో కీలక పాత్ర పోషించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించేందుకు సురేందర్ కృషిని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేందర్‌ను ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేందర్ అవార్డు అందుకోనున్నారు.

## నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు

### స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రవీందర్


మాట్లాడుతున్న డీఐజీ రవీందర్

హాజీపూర్, సెప్టెంబర్ 4 : మంచిర్యాల జిల్లాలో నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రవీందర్ తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించి పలువురు క్రయ, విక్రయ దారులను కార్యాలయంలో అందుతున్న సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివాహ ధ్రువీకరణపత్రాల కోసం వచ్చిన వారిని పలు విషయాలు అడిగారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


చెన్నూర్ కోర్టు ఎదుట నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎన్ని కేసులు పెట్టినా పోరాడుతూనే ఉంటాం

### కోర్టుకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 4 : బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కేసులు, కోర్టులు కొత్తేమీ కాదని, రైతులు, వారి కుటుంబాల కోసం ఎన్ని పోరాటాలకైనా సిద్ధమని బీఆర్ఎస్ నాయకుడు డా.రాజారమేశ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపుమేరకు డా.రాజారమేశ్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఇటీవల పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ తీశారు. ఈ నేపథ్యంలో వారిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసులు పెట్టింది. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు డా.రాజారమేశ్, మేడి తిరుపతి, బల్మూరి అరవింద్ రావు, కోట వెంకటేశ్, ఆకుల రవి, బడుగు రవి, రాజశేఖర్, రాజేందర్, చందు, మల్లేశ్, నాగరాజులు బుధవారం చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. తమపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యంగా కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పిస్తున్నదని ఆరోపించారు. అడ్డగోలుగా హామీలిచ్చి నమ్మించి తడిగుడ్డతో గొంతుకోశారని, వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని విమర్శించారు.


జైనూర్‌లో దుకాణ సముదాయాలకు నిప్పు పెట్టడంతో చెలరేగుతున్న మంటలు


పరిస్థితిని అదుపు చేస్తున్న ప్రత్యేక పోలీసు బలగాలు

# జైనూర్‌లో భయానకం

## ఆదివాసీ మహిళపై లైంగిక దాడి ఘటనతో మండిపడ్డ ఆదివాసులు

- ఓ వర్గానికి చెందిన 50కిపైగా వ్యాపార సముదాయాలు దగ్ధం
- బైక్‌లు, బొలెరోకు నిప్పు.. పదుల సంఖ్యలో కాలిబూడిదైన వాహనాలు
- శ్మశానాన్ని తలపిస్తున్న జైనూర్ మండల కేంద్రం
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల పోలీసుల మోహరింపు
- బుధవారం రాత్రి వరకు కూడా వీడని ఉత్కంఠ
- జైనూర్‌లో 144 సెక్షన్ అమలు : ఎస్పీ గౌష్ ఆలం

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో బుధవారం భయానక వాతావరణం నెలకొన్నది. ఆదివాసీ మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి యత్నించిన ఘటన ఆగ్రహానికి కారణమైంది. ఒక వర్గానికి చెందిన ఆటో డ్రైవర్ చేసిన పనితో సహనం కోల్పోయిన ఆదివాసులు వారి వ్యాపార సముదాయాలను కాల్చి బూడిద చేశారు. రోడ్డుపై నిలిపిన వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ దాడిలో దాదాపు 50కి పైగా దుకాణాలు, పదుల సంఖ్యలో వాహనాలు కాలి బూడిదయ్యాయి. దుకాణాలు, వాహనాలు కాలుతున్న దృశ్యాలతో మండల కేంద్రం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు జైనూర్ మండల కేంద్రానికి చేరుకుని పరిస్థితిని అదుపులో తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. జైనూర్ మండల కేంద్రంలో అకస్మాత్తుగా జరిగిన ఘటనతో సామాన్యులు భయభ్రాంతులకు గురయ్యారు. సాధారణ ప్రజలు బయటికి రావాలంటే వణికిపోతున్నారు.

### వ్యాపార సముదాయాలకు నిప్పు

తమ సోదరుడికి రాఖీ కట్టేందుకు ఆటోలో వెళ్తున్న ఆదివాసీ మహిళపై ఆటోడ్రైవర్ లైంగిక దాడికి పాల్పడి హత్యాయత్నం చేశాడు. ప్రాణపాయ స్థితుల్లో ఉన్న ఆదివాసీ మహిళ గాయాలతో రోడ్డుపైకి వచ్చి కొంత మంది సహాయంతో ఆసుపత్రికి చేరుకున్నది. ఆలస్యంగా వెలుగులో వచ్చిన ఈ ఘటన ఆదివాసీ వర్గాలను ఆగ్రహానికి గురి చేసింది. దీంతో రెండు రోజుల క్రితం జైనూర్ మండల కేంద్రంలో రాస్తారోకో చేసిన ఆదివాసులు బుధవారం జైనూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసులు భారీ సంఖ్యలో తరలిరాగా.. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ ఆటో డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నామని, చట్టపరంగా శిక్షిస్తామని ఆదివాసులకు వివరించారు. అయినప్పటికీ శాంతించని ఆదివాసులు జైనూర్ మండల కేంద్రంలో ఉన్న ఆటో డ్రైవర్ వర్గానికి చెందిన వ్యాపార సముదాయాలపై దాడులు చేశారు. మూసి ఉన్న దుకాణాల తాళాలను పగులగొట్టి షాపులకు నిప్పు పెట్టారు. రోడ్లపై నిలిపి ఉన్న వాహనాలను కాల్చిబూడిద చేశారు. ఓ వర్గానికి చెందిన ప్రార్థనా మందిరంలో చొరబడి విధ్వంసం చేశారు. దీంతో ఆటో వర్గానికి చెందిన వారు కూడా కర్రలు, రాళ్లు వంటి ఆయుధాలతో ఎదురు దాడికి ప్రయత్నం చేశారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌కు చెందిన ప్రత్యేక పోలీసు బలగాలు జైనూర్‌కు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. జైనూర్ మండల కేంద్రాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోడ్లపై ఎవరూ తిరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ ఇరువర్గాల మధ్య ఘర్షణతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి ఎదురైంది. సామాన్య ప్రజలు రోడ్డుపైకి రావడానికి వణికిపోతున్నారు. గత ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ఘటనలే చోటు చేసుకోవడంతో జైనూర్ దాదాపు పది రోజులపాటు దుకాణాలు మూసి ఉంచారు. ఆదివాసులు, ఆటో డ్రైవర్ వర్గానికి గత కొన్ని ఏండ్లుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొన్నది. జైనూర్ మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల ఉన్న ఆదివాసీ గ్రామాల ప్రజలు, ఆటోడ్రైవర్ వర్గానికి చెందిన ప్రజలపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు.


బాధితురాలిని పరామర్శిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి

– ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 4 : ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. ఆదివాసీ మహిళకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆదివాసులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జైనూర్ మండలంలో గతంలోనూ ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నట్లు గుర్తు చేశారు. అక్కడ జరుగుతున్న ఘర్షణలపై ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

### సంయమనం పాటించాలి..

– ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 4 : జైనూర్‌లో జరిగిన ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని, పోలీసు యంత్రాంగం కేసులను నమోదు చేసిందని, దర్యాప్తు కొనసాగుతుందన్నారు. కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని తెలిపారు. సోషల్ మీడియాపై నిఘా ఉందన్నారు. జైనూర్‌లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఇతర ప్రాంతాలవారికి జైనూర్‌లో అనుమతి లేదన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తప్పు చేసిన వారికి శిక్షలు తప్పవని తెలిపారు.


కుమ్రం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

## కుమ్రం భీం ప్రాజెక్టు 5 గేట్ల ఎత్తివేత

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 4 : మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని వానకు బుధవారం కుమ్రం భీం ప్రాజెక్టులోని భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 243 మీటర్లు(10.393 టీఎంసీలు) ఉండగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 8970 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి రావడంతో ప్రస్తుత నీటి మట్టం 237.5 మీటర్లు(5.688 టీ ఎంసీలు)లకు చేరిందని అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 3, 4, 5, 6, 7 గేట్లను 1 మీటర్ వరకు ఎత్తి 10480 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు.

### వట్టివాగు ప్రాజెక్టు 5వ గేటు ఎత్తివేత

వట్టివాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 241.50 మీటర్లు(2.89 టీఎంసీలు) ఉండగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 7770 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి రావడంతో ప్రస్తుత నీటి మట్టం 237.400మీటర్లు(2.078 టీఎంసీలు)లకు చేరిందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 5వ గేట్‌ను 0.2 మీటర్లు ఎత్తి 2160 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఎలుగుబంటి దాడి మేకల కాపరికి తీవ్ర గాయాలు


గాయపడిన నాగరాజును దవాఖానకు తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

హాజీపూర్, సెప్టెంబర్ 4 : ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన జగన్నాథుల నాగరాజుకు చెందిన మేకలు మేతకు వెళ్లి ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో ముల్కల్ల ర్యాలీ వాగు సమీపంలోని అటవీ ప్రాంతంలో గాలిస్తుండగా పిల్లలతో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా నాగరాజు ముఖంపై దాడి చేసింది. తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉన్న నాగరాజును ముల్కల్ల గ్రామానికి చెందిన కొందరు రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ ఆదేశాల మేరకు ఎంజీఎంకు వెళ్లి నాగరాజును పరామర్శించి రూ.20 నగదును కుటుంబ సభ్యులకు ఫారెస్ట్ అధికారులు హతవుల్లా, హల్తాప్ హుస్సేన్ అందజేశారు.

## ఆటోడ్రైవర్‌ను శిక్షించాలని రాస్తారోకో

కెరమెరి, సెప్టెంబర్ 4: జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి యత్నించి, హత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కెరమెరి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై బైఠాయించి బుధవారం ఆదివాసీ నాయకులు రాస్తారోకో చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా నేరస్తుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ నిరసనలో ఆదివాసీ నాయకులు పెందోర్ మోతీరాం, కోవ విజయ్ కుమార్, కోవ ఇందిరా, పెందోర్ రాజేశ్వర్, కుమ్రం నాణేశ్వర్, రాము, సెడ్మాకి తుకారాం, సిడాం ధర్ము, పూసం భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.


కెరమెరిలో రాస్తారోకో చేస్తున్న ఆదివాసులు


బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న యువతికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## బ్యూటీషియన్ కోర్సులతో ఉపాధి పొందాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 4 : ప్రభుత్వం మహిళ, సంక్షేమ శాఖ ద్వారా జిల్లా మహిళా సాధికారత కేంద్రం సహకారంతో భేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న బ్యూటీషియన్ కోర్సులను విద్యార్థినులు, యువతులు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థినులు, యువతులు, మహిళలు ప్రభుత్వం అందిస్తున్న టైలరింగ్, బ్యూటీషియన్, స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం జిల్లాలోని కాగజ్‌నగర్‌లోని డిగ్రీ కళాశాల, బెండారలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 45 రోజుల బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన 93 మంది డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సీడీపీవోలు మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, శిక్షకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## వాన..వరద..నష్టం

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 1200 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ఆందోళనలో రైతన్నలు
- దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న భా రీ వర్షాలు పలు మండలాల్లో భారీ నష్టాన్ని మిగిల్చాయి. వరదల ధాటికి పంటలు కొట్టుకపోగా కల్వర్టులు, రోడ్లు ధ్వంసమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో రోజుల తరబడి పంటలు నీట మునిగే ఉన్నాయి. దీంతో మొక్కలు జాలు పట్టి రైతులకు తీరని నష్టం కలిగింది. జూలై చివరి వారంలో కురిసిన వర్షాలతో జిల్లాలో దాదాపు 12 వేల ఎకరాల్లో పంటలకు నష్టం కలిగింది. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలతో జిల్లాలో 900 ఎకరాల్లో పత్తి, 300 ఎకరాల్లో మిరప పంటలు దెబ్బతిన్నాయి. వట్టివాగు, కుమ్రం భీం ప్రాజెక్టుల్లోకి వస్తున్న వరద నీటిని పెద్ద ఎత్తున పెద్దవాగులోకి వదిలివేయడంతో పెద్ద వాగులో ఉధృతి పెరిగి పరివాహక ప్రాంతాల్లో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. 10 టీఎంసీల సామర్థ్యం ఉన్న కుమ్రం భీం ప్రాజెక్టు కట్ట దెబ్బతినడంతో అధికారులు ప్రాజెక్టుని ఐదు టీఎంసీల సామర్థ్యానికే పరిమితం చే శారు. దీంతో వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని వెంట వెంటనే గేట్లు తెరిచి దిగువకు వదులుతున్నారు. దీంతో భారీ వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సమీపంలోని పంట పొలాలు దెబ్బతినడంతోపాటు కల్వర్టులు, రోడ్లు ధ్వంసమయ్యాయి. జి ల్లాలో 14 కల్వర్టులు పూర్తిగా ధ్వంసం కాగా మరో 10 వరకు తాత్కాలికంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. 15 రహదారులు ధ్వంసమైనట్లు అంచనావేశారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని కాగజ్‌నగర్, దహెగాం, బెజ్జూర్, పెంచికల్‌పేట్, సిర్పూర్–టీ మండలాల్లోని వాగు పరివాహక ప్రాంతాల్లో పంటలకు తీవ్రమైన నష్టం కలిగింది. మారుమూల ప్రాంతాల్లోని రోడ్లు, కల్వర్టులు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నా యి. వర్షాలతో గ్రామాల్లో ఏర్పడిన అపరిశుభ్రత కారణం గా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.


వరదలో నీట మునిగిన పత్తి పంట


కొట్టుకుపోయిన మాలన్‌గొంది వంతెన

### మంచిర్యాల జిల్లాలో 805 ఎకరాల్లో పంట నష్టం

మంచిర్యాల (ఏసీసీ), సెప్టెంబర్ 4: అకాల వర్షాలతో ప్రాథమిక అంచనా మేరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 805 ఎకరాల పంట నష్టం జరినట్లు వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 520 ఎకరాల్లో పత్తి, 285 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి కచ్చితమైన వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం వాటిని నివేదిక రూపంలో పొందుపరిచి, పై అధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో గేట్లు ఎత్తివేశారు. పలు వాగులు, వంకలు పొంగి పొర్లడంతో జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి.











